
సాక్షి
కాకినాడ
మంగళవారం । 16 । మే । 2023



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి నల్లా రామకృష్ణ వెంకట నాగ కుమార్ దంపతులు (ఉప్పలగుప్తం మండలం విలసవిల్లి) రూ.లక్ష విరాళం అందించారు.



మిగులు జలాల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 7,232 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.10 అడుగులకు చేరింది.



కల చెదిరి.. వ్యథ మిగిలి...

తాళ్లరేవు ఆటో ప్రమాదంలో మృతి చెందిన మహిళలకు కుటుంబ సభ్యులు, బంధువులు సోమవారం యానాంలో కన్నీటి వీడ్కోలు పలికారు. - 8లో▸

న్యూస్‌రీల్

స్పందనకు 294 అర్జీలు



హిజ్రాలకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: కాకినాడ కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో సోమవారం జిల్లా స్థాయి స్పందన జరిగింది. కలెక్టర్ కృతికా శుక్లా తోపాటు జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ, ఇన్‌ఛార్జి డీఆర్వో, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వ వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవ రత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి 294 అర్జీలు అందాయన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందనకు వచ్చిన అర్జీలను గడువు లోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఎనిమిది మంది హిజ్రాలకు జిల్లా కలెక్టర్ ఐడీ కార్డులను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలు, రైస్ కార్డు, పింఛన్, బస్ టికెట్‌లో రాయితీ, ఇంటి స్థలం మొదలైన వాటిని లబ్ధిపొందేందుకు ఈకార్డులు ఉపయోగపడతాయన్నారు.

జేఎన్‌టీయూకే అడ్మిషన్స్ డైరెక్టర్‌గా మల్లిఖార్జున ప్రసాద్

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే అడ్మిషన్స్ డైరెక్టర్‌గా ఈసీఈ ప్రొఫెసర్ డాక్టర్ ఏ.మల్లిఖార్జున ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ అడ్మిషన్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించి ప్రొఫెసర్ కె.పద్మరాజు ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ వీసీగా నియమితులు కావడంతో ఈయనను నియమించారు. బాధ్యతలు స్వీకరించిన ప్రసాద్‌ను వర్సిటీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు,రిజిస్ట్రార్ సుమలత అభినందించారు.

సత్యదేవునికి ఏకాదశి పూజలు



రత్నగిరిపై సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: వైశాఖ బహుళ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం రత్నగిరి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం సత్యదేవునికి స్వర్ణ పుష్పాలు, లక్ష తులసీ దళాలతో పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవారికి వేదపండితులు మంత్రపుష్పాలు సమర్పించారు. ఆలయ ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, ఇంద్రగంటి వెంకటేశ్వర్లు, అర్చకులు కంచిభొట్ల సాయికుమార్ తదితరులు పూజాదికాలు నిర్వహించారు. ఏకాదశి పర్వదినం సందర్భంగా సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో రద్దీ నెలకొంది. సత్యదేవుడిని దర్శించిన అనంతరం భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. రెండు వేల మంది స్వామివారి వ్రతాలు ఆచరించారు.

సూర్యుడు మండే

- అగ్నిగుండంలా మారిన వాతావరణం
- ఉదయం 10 గంటలకే ఉష్ణతాపం
- వేడి గాలులతో జనం హడల్
- నిర్మానుష్యంగా ప్రధాన రహదారులు
- జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: నింగిలోని సూర్యుడు ఒక్కసారిగా భగ్గుమన్నాడు. నింగి నుంచి నిప్పుల వర్షం కురిపించాడు. కొద్ది రోజులుగా చండప్రచండంగా చెలరేగుతున్న మార్తాండుడు.. సోమవారం మరింత ఉగ్రరూపమెత్తాడు. ఫలితంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అగ్నిగుండంగా మారింది. బంగాళాఖాతంలో ఇటీవల ఏర్పడిన మోకా తుపాను ప్రభావంతో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. దీంతో ప్రజలు ఆపసోపాలు పడుతున్నారు. ఈ నెల 11న పెద్ద కత్తెర ప్రారంభమైనప్పటి నుంచీ ఉష్ణోగ్రతల్లో గణనీయంగా పెరుగుదల నమోదవుతోంది. ఈ నెల 25న రోహిణీ కార్తె ప్రారంభం కానుంది. అయితే, ఇప్పుడే రోహిణి వచ్చేసినట్టు ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణతీవ్రత ఒక్కసారిగా పెరిగిపోవడంతో జనం హడలెత్తుతున్నారు. అత్యవసరమైతే తప్ప గుమ్మం దాటి బయటకు వచ్చే సాహసం చేయలేకపోతున్నారు. బయట పనులుంటే చాలామంది ఉదయం 10 గంటల్లోపు, సాయంత్రం 4 గంటల తరువాత మాత్రమే వెళ్తున్నారు. మధ్యాహ్నం పూట చాలా వరకూ ప్రయాణాలు మానుకుంటున్నారు. చాలాచోట్ల సాయంత్రం వరకూ రోడ్లన్నీ దాదాపు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి.

కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లో వీస్తున్న వేడిగాలులు ప్రజలకు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. రాత్రయినా గాలుల్లో వేడి తగ్గకపోవడంతో వారు నానా ఇబ్బందులూ పడుతున్నారు. సముద్ర తీరాన ఉన్న కాకినాడ జిల్లాలోని పలు ప్రాంతాల్లో సాయంత్రం 5 గంటల తరువాత వాతావరణం కాస్త చల్లబడుతోంది. గోదావరి నదికి అటు, ఇటు ఉన్న తూర్పు గోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు తదితర ప్రాంతాల ప్రజలు ఎండ వేడి, ఉక్కపోత, వడగాడ్పులతో ఆపసోపాలు పడుతున్నారు.

ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్‌లో)

నగరం/పట్టణం	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	44.0	28.0
అమలాపురం	43.4	28.0
కాకినాడ	42.8	28.3

వ్యాపారాలపై ఉష్ణఘాతం

ఎండల తీవ్రత అన్ని రంగాలనూ ప్రభావితం చేస్తోంది. మండిపోతున్న ఎండలతో వివిధ పట్టణాలతో పాటు గ్రామాల్లో రోడ్ల వెంబడి తోపుడు బండ్లు, తాటియాకు పాకల్లో చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటున్న వారు తమ ఉపాధి దెబ్బ తింటోందని వాపోతున్నారు. తెల్లవారకుండానే మోటార్ సైకిళ్లు, సైకిళ్లపై కడియం, ఆలమూరు, రావులపాలెం, రాజానగరం, కోరుకొండ, సీతానగరం తదితర మండలాల్లోని పల్లెల నుంచి కొబ్బరి బొండాలు, పుచ్చకాయలు, దానిమ్మ, పనస, అరటి పండ్లు, జామకాయలు, బొప్పాయి, దోసకాయల వంటి వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు ఎండల తీవ్రతతో బెంబేలెత్తిపోతున్నారు. బతుకుతెరువు కోసం అనివార్యంగా రోడ్డు మీదకు వస్తున్నా.. ఎండలు తీవ్ర రూపం దాల్చకముందే అమ్మకాలు ముగించేసి ఇంటి దారి పడుతున్నారు.



దాదాపు నిర్మానుష్యంగా మారిన రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్ సెంటర్



అమలాపురంలో నిర్మానుష్యంగా ప్రధాన రహదారి

నిర్లక్ష్యం చేస్తే వడదెబ్బ



శరీరాన్ని అన్ని వేళలా తేమతో ఉంచడంలో చిరుధాన్యాలు కీలక పాత్ర పోషిస్తాయి. వాటితో చేసే ఆహార పదార్థాలు వడదెబ్బ నుంచి కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. కెన్‌జెన్ నీరు అన్ని విధాలా సురక్షితం, ఆరోగ్యం. అవకాశాన్ని బట్టి దీనిని తాగుతూండాలి. వయసెంత చిన్నదైనా, శరీరం ఎంతటి దృఢమైనదైనా ఉష్ణోగ్రతలపై నిర్లక్ష్యంగా ఉంటే వడదెబ్బ తగలక మానదు. వ్యాయామం చేసేవారు, క్రీడాకారులకు వడదెబ్బ తగిలే అవకాశం ఎక్కువ. తీవ్ర శారీరక వ్యాయామం వల్ల వడదెబ్బ తగిలే స్థితి ప్రత్యేకమైనది. దీన్ని ఎక్సర్షనల్ హీట్ స్ట్రోక్ అంటారు. ఈ వేడిని నియంత్రించేందుకు ఐస్ బాత్ ఒక్కటే మార్గం.

– డాక్టర్ ఇ.గౌరీశేఖర్, కాకినాడ

జాగ్రత్తలు తప్పనిసరి



అధిక ఉష్ణోగ్రతలపై ప్రభుత్వం ప్రజలను అప్రమత్తం చేస్తోంది. వడదెబ్బ నివారణ జాగ్రత్తలను ప్రజలకు వివరిస్తున్నాం. శరీర ఉష్ణోగ్రతలు 105.1 ఫారిన్‌హీట్ కంటే ఎక్కువ ఉండటం, చర్మం పొడిబారడం వంటి లక్షణాలున్న వారు మంచినీరు ఎక్కువగా తాగాలి. అటువంటి వారు ఎండలో ఎక్కువగా తిరగకుండా వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి. ఆహారం తక్కువ మోతాదులో ఎక్కువసార్లు తీసుకోవాలి. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు వడదెబ్బ తగలకుండా మరింత అప్రమత్తంగా ఉండాలి. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వీలైనంత వరకూ ఇంట్లోనే ఉండాలి.

– ఆర్.రమేష్, డీఎంహెచ్‌ఓ, కాకినాడ

అమ్మకాలు పడిపోయాయి

వడగాల్పులతో ఉదయం 10 గంటలకే ఎవరూ బయటకు రాకపోవడంతో అమ్మకాలు పడిపోయాయి. వారం రోజులుగా పెట్టుబడి కూడా దక్కడం లేదు. దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. ఎండలకు భయపడి ఉదయం నుంచి సాయంత్రం వరకూ దుకాణాలు మూసేసి, ఆరు గంటల మధ్య మాత్రమే తెరుస్తున్నాం.

– కొల్లి శ్రీనివాస్, పూల వ్యాపారి, మండపేట

వ్యాపారం సాగడం లేదు

ఎండలతో వ్యాపారం అస్సలు సాగడం లేదు. గతంలో ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకూ అరటి పండ్లు అమ్మేవాడిని. ఎండలకు జనం బయటకు రాకపోవడంతో ప్రస్తుతం సాయంత్రం ఐదు తరువాత మాత్ర మే వ్యాపారం జరుగుతోంది.

– చాట్ల శ్రీనివాస్‌రెడ్డి, అరటి పండ్ల వ్యాపారి, గాంధీనగర్, కాకినాడ

ప్రత్యేక ప్రతిభావంతులకు
ఆర్థిక సాయం

జిల్లాకు రూ.35,73లక్షలు విడుదల



ఫిజియోథెరపి నిర్వహిస్తున్న దృశ్యం



చామంతి నాగేశ్వరరావు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రత్యేక అవసరాల పిల్లల్లో మానసిక, శారీరక ఎదుగుదలకు భవిత కేంద్రాల ద్వారా ప్రభుత్వం కృషి చేస్తోంది. వివిధ థెరపీల ద్వారా వీరిలో చైతన్యం కలిగిస్తోంది. ఇళ్లలో ఉంటే మరింత మానసికంగా కుంగిపోతారని భవిత కేంద్రాలకు తీసుకువచ్చి ఆటపాటా నేర్పిస్తోంది. ఈ కేంద్రాలలో ఫిజియోథెరపిస్టులను నియమించింది. కదలలేని పిల్లల కోసం వారానికి ఒకసారి ఇళ్లకే ఫిజియో థెరపిస్టులు వెళ్లి సేవలు అందిస్తున్నారు. పిల్లలను భవిత కేంద్రాలకు తీసుకొచ్చేందుకు తల్లిదండ్రులకు ప్రభుత్వం కొంత ఆర్థిక సాయం అందస్తోంది. ట్రాన్స్‌పోర్టు, హోమ్‌బేస్డ్ ఎడ్యుకేషన్, ఎస్కార్ట్, బాలికల ప్రత్యేక విద్య, స్టైఫండ్ కోసం ఖర్చు చేయాలని తాజాగా రూ.35.73లక్షలు విడుదల చేసింది. ఈ మొత్తాన్ని పిల్లల తల్లుల ఖాతాల్లోకి జమ చేసింది. జిల్లాలో 3633మంది ప్రత్యేక విభిన్న ప్రతిభావంతులుండగా 21 భవిత కేంద్రాలు ఉన్నాయి. కేంద్రాల్లో 494 మంది సేవలు పొందుతున్నారు. 1094మందికి ఇంటి వద్ద సేవలందిస్తున్నారు. 406 మందికి రవాణా అలవెన్స్‌లను నెలకు రూ.3వేల చొప్పున, ఎస్కార్ట్ అలవెన్స్‌గా 62 మందికి రూ.3వేల చొప్పున, 210 మందికి హోమ్‌బేస్డ్ ఎడ్యుకేషన్ అలవెన్స్‌గా రూ.3వేల చొప్పున,21మందికి రీడింగ్ అలవెన్స్‌గా రూ.3వేల చొప్పున, 717మందికి గర్ల్ స్టైఫండ్ కింద రూ.2వేల చొప్పున నిధులు విడుదలయినట్లు సహిత విద్య జిల్లా కో–ఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు సాక్షికి తెలిపారు.

ప్రమాదాల కట్టడికి బ్లాక్ స్పాట్లపై దృష్టి

కలెక్టర్ కృతికా శుక్లా



జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రధానంగా బ్లాక్‌స్పాట్‌లపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా రహదారి భద్రత కమిటీ (డీఆర్‌ఎస్సీ) సమావేశంలో మాట్లాడారు.మీడియన్లు, సెంట్రల్ డివైడింగ్ లైటింగ్ సిస్టమ్, హైమాస్ట్ లైటింగ్ టవర్, అప్రోచ్ రోడ్ స్పీడ్ బ్రేకర్లు తదితరాలు లేకపోవడంతో జాతీయ రహదారులపై ప్రమాదాలు సంభవిస్తున్నట్లు గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 8 మధ్య ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని తేలిందన్నారు. ప్రమాదం జరిగితే సంయుక్త కమిటీ తనిఖీ చేసి సమగ్ర నివేదికను అందజేయాలన్నారు. ఇంజినీరింగ్ పరంగా ఏమైనా లోపాలుంటే సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్పీడ్ బ్రేకర్లు, సైన్ బోర్డులు, హెచ్చరిక బోర్డులు, స్పీడ్ లిమిట్ బోర్డులు, రంబర్ స్టిక్కర్లు వంటివి ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదాలను తగ్గించేందుకు భవిష్యత్తులో తీసుకోనున్న చర్యలను ఎస్పీ సతీష్‌కుమార్ వివరించారు. నగర పాలక సంస్థ కమిషనర్ ఆర్ మహేష్‌కుమార్, ఇన్‌చార్జి డీఆర్వో కె శ్రీరమణి, ఎన్‌హెచ్‌ఏఐ పీడీ డి సురేంద్రనాథ్, ప్రజారవాణా అధికారి ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయం, సమష్టి కృషితో గంజాయి, మాదక ద్రవ్యాలకు అడ్డుకట్ట

జిల్లాను గంజాయి, మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా మార్చేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వివేకానందహాల్‌లో నిర్వహించి నార్కో సమన్వయం కమిటీ సమావేశంలో మాట్లాడారు. గంజాయిపై సమాచారం అందించేందుకు 14500 టోల్‌ఫ్రీ నంబర్ అందుబాటులో ఉందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోనూ ఈ నంబర్‌ను ప్రదర్శించాలన్నారు. ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ రాత్రిపూట రైడ్‌లను ముమ్మరం చేసినట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల నుంచి వచ్చే రహదారుల వెండి తనిఖీలు నిర్వహించడం ద్వారా గంజాయి రవాణాను అడ్డుకోవచ్చన్నారు. ఇన్‌ఛార్జి డీఆర్వో కె శ్రీరమణి, కాకినాడ ఆర్డీవో బీవీ రమణ, డీఎస్పీ మురళీ కృష్ణారెడ్డి, డీఎఫ్‌వో ఐవీకే రాజు, డీఎంఅండ్‌హెచ్వో ఆర్ రమేష్, డీఈవో కెఎస్‌వీఎస్ అన్నపూర్ణ, ఆర్టీసీ ప్రజా రవాణాధికారి ఎం శ్రీనివాసరావు, వివిధ విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం కప్ విజేతలకు అభినందన

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి 5 వరకు తిరుపతిలో నిర్వహించిన సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు సోమవారం కలెక్టర్ కృతికా శుక్లా తేనేటి విందును ఇచ్చి అభినందించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను విజేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీ క్రీడాంశంలో ఎవరు విజేతలయ్యారో అడిగి తెలుసుకున్నారు. వారిని ప్రశంసించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి 14 క్రీడాంశాలల్లో 332 మంది పురుషులు, మహిళల జట్లు పాల్గొన్నారు. 9 క్రీడాంశాలలో వివిధ విభాగాల్లో 31 మంది క్రీడాకారులు గోల్డ్, సిల్వర్, బ్రౌంజ్ మెడల్స్‌ను గెలుచుకున్నారు. కొన్ని క్రీడాంశాలలో మొదటి, రెండోవ, మూడోవ స్థానాలను కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో సీఈవో షేక్ ఇమ్రాన్, ముఖ్య క్రీడాశిక్షకులు బి శ్రీనివాసకుమార్, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి వికెఆర్ తంబిలతో పాటు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ క్రీడా శిక్షకులు వి సతీష్‌కుమార్, వి ఆర్ రుద్ర, ఎండీ అలీషా షరీఫ్, పిటీ నాగేంద్రకుమార్, పి ప్రవీణ్‌కుమార్, ఆర్ జీవన్‌కుమార్ పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

సర్ ఆర్థర్ కాటన్‌కు ఘననివాళి



సర్ ఆర్థర్ కాటన్ జయంతిని నిర్వహిస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

కాకినాడ సిటీ: జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో సర్ ఆర్థర్ కాటన్ జయంతి వేడుకలను జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు మాట్లాడుతూ కాటన్ తన జీవితాన్ని బ్రిటిష్ భారత ప్రభుత్వంలో నీటిపారుదల, నావికాయోగ్యమైన కాలువలు కట్టించడానికి ధారపోశాడన్నారు. క్షామపీడితమైన గోదావరి డెల్టా సస్యశ్యామలం చేసి లక్షల ఎకరాల భూమిని సాగు కిందికి తీసుకొచ్చారన్నారు. కాటన్‌దొర చేసిన సేవలను గుర్తించుకొని ఏపీ ప్రభుత్వం ఆయన పేరు మీదుగా ధవళేశ్వరం వద్ద ఆయన పేరుతో ఒక మ్యూజియం కూడా ఏర్పాటు చేసిందన్నారు. కాటన్ మహాశయునికి ఘనమైన నివాళిని అర్పిస్తూ జయంతిని పురస్కరించుకొని ఉద్యోగులందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఎన్‌వీవీ సత్యనారాయణ మాట్లాడుతూ కాటన్ మహాశయుని స్ఫూర్తిగా తీసుకొని ఇంజినీరింగ్ విభాగం, పంచాయతీరాజ్ జిల్లా ప్రజాపరిషత్‌కు సంబంధించి ఉద్యోగులందరూ అత్యుత్తమ సేవలు ప్రజలకు, శాఖకు అందించాల్సిందిగా పిలుపునిచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు, ఏపీ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్ వి వి రమేష్, జిల్లా పరిషత్ కార్యాలయం సిబ్బంది, ఇంజనీరింగ్ విభాగపు కార్యాలయపు సిబ్బంది పాల్గొన్నారు

గంగపుత్రులకు బెంగ లేదిక

- జిల్లాలో 24,147మందికి వైఎస్సార్ మత్స్యకార భరోసా భృతి నేడు జమ
- రూ.24.14కోట్ల మేర చెల్లింపునకు ఏర్పాట్లు
- 7050మందికి ఓఎన్‌జీసీ పరిహారం కూడా..

కాకినాడ రూరల్: సముద్రంలో చేపల వేట నిషేధంతో ఉపాధి దూరమై ఇబ్బందులు పడుతున్న వారికి ప్రభుత్వం సహాయ హస్తం అందించనుంది. వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం కింద రూ.10వేలు వంతున మంగళవారం నిషేధ భృతిని అందజేయనుంది. గత నెల 15నుంచి 61రోజుల పాటు వేట నిషేధం అమలులో ఉంటుంది. ఈ సమయంలో ఆర్థిక ఇబ్బందులు పడే గంగపుత్రులకు నిషేధ భృతిని పెంచి ఆదుకోవాలని ప్రభుత్వం సంకల్పించింది. బాపట్ల జిల్లా నిజాంపట్నంలో మంగళవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి డీబీటీ ద్వారా లబ్ధిదారుల ఖాతాలకు భృతిని జమ చేయనున్నారు. రాష్ట్రంలో అత్యధిక మత్స్యకారులు మన జిల్లాలోనే ఉన్నారు.

తుని నుంచి తాళ్లరేవు వరకూ

జిల్లాలో ఈ ఏడాది 24,147మందికి వేట నిషేధ భృతి అందనుంది. తుని నుంచి తాళ్ళరేవు వరకు ఏడు మండలాల్లో 94కిలో మీటర్ల మేర తీర ప్రాతం విస్తరించి ఉంది. సుమారు 2 లక్షల మంది మత్స్యకారులు ఉన్నారు. సముద్ర చేపల వేట ద్వారా వీరిలో 36వేల మంది జీవనోపాధి పొందుతున్నారు. కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువగా ఉన్నవారు కూడా ఉన్నారు. మత్స్యకార భరోసా పథకం కింద గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, మత్స్యశాఖ అధికారులు కసరత్తు చేసి పారదర్శకంగా తుది జాబితాను రూపొందించారు. 24147మందిని ఎంపిక చేశారు. వీరందరికీ మంగళవారం రూ.10వేల చొప్పున రూ.24.14కోట్లు జమ కానుంది. గత ఏడాది 21300మందికి చెల్లించగా ఈ ఏడాది 3100మంది కొత్తగా లబ్ధిపొందనున్నారు.



చేపల వేట నిషేధంతో వలలు నేస్తున్న మత్స్యకారులు

గత ప్రభుత్వంలో అరకొరగానే... :

టీడీపీ ప్రభుత్వం హయాంలో వేట నిషేధ భృతి అరకొరగానే అమలయ్యేది. తక్కువ మందిని ఎంపిక చేసి వేట సమయంలో ముగిసేకా రూ.4వేలు చొప్పున పంపిణీ చేసేవారు. ఇది కూడా చాలా మందికి అందేది కాదు. 2019 నుంచి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మత్స్యకారులకు పెద్ద పీట వేసింది. పాదయాత్రలో మత్స్యకారులకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిషేధ భృతిని రూ.10వేలకు పెంచారు. వేట సమయంలో ప్రమాదవశాత్తూ సముద్రంలో మునిగి మరణించే మత్స్యకారుల కుటుంబ సభ్యులకు ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను రూ.10లక్షలకు పెంచింది. చేసింది.

ఓఎన్‌జీసీ పరిహారం కూడా ..

తాళ్ళరేవు మండలం తీర ప్రాంతంలో ఓఎన్‌జీసీ పైపులైన్ పనులు జరుగుతుండడంతో అక్కడ సముద్రంలో చేపల వేట నిలిచిపోయింది. వేటపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్న 7050మంది మత్స్యకారులను గుర్తించి నెలకు రూ.11500 చొప్పున నాలుగు నెలలకు గాను రూ.46వేలు మంగళవారం జమ చేయనున్నారు. రూ.32.43కోట్లు మేర పరిహారాన్ని ఓఎన్‌జీసీ ద్వారా ప్రభుత్వం అందించనుంది.

అర్హులకు మరో అవకాశం



సముద్రంలో చేపల వేటపై ఆధారపడిన మత్స్యకారులకు ముఖ్యమంత్రి మంగళవారం నిషేధ భృతిని జమ చేస్తున్నారు. 24800మందిని తొలుత ఎంపిక చేశాం. వివిధ కారణాల వలన కొందరు ఎంపిక కాలేదు. 24147మంది ఎంపికయ్యారు. అర్హత ఉండి భరోసా రాకుంటే సచివాలయంలో ఫిర్యాదు చేయండి. మరో అవకాశం ఉంది.

– పీవీ సత్యనారాయణ, మత్స్యశాఖ అధికారి,

వేట నిషేధంలో ఆదుకుంటున్నారు



వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం కింద రూ.10వేలు మంజూరయ్యాయి. సీఎం జగన్ మంగళవారం జమ చేయనున్నారని తెలిసి మా కుటుంబం చాలా సంతోషంగా ఉంది. వేట నిషేధం ద్వారా మాలాంటి మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకుంటుంది., ముఖ్యమంత్రికి ధన్యవాదాలు.

– సూరాడ కాశీ విశ్వనాథ్, మత్స్యకారుడు, సూర్యారావుపేట.. కాకినాడ రూరల్

క్లుప్తంగా

ఎండుగడ్డి ఒబ్బిడి చేస్తూ యువకుడి మృతి


మృతుడు ప్రసాద్ (పాత చిత్రం)

అల్లవరం: ఓ యువకుడు పొలంలో ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాడు. తహసీల్దార్ సాంబశివప్రసాద్ కథనం ప్రకారం.. కపిలేశ్వరపురం మండలం టేకి గ్రామానికి చెందిన కాజులూరి ప్రసాద్ (27) అల్లవరం మండలం ఎంట్రుకోనలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం వరకూ తాపీపని చేసి, ఇంటికి వచ్చాడు. పశువులకు ఎండు గడ్డిని ఒబ్బిడి చేసేందుకు పొలానికి వెళ్లాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అప్పటికే ప్రసాద్ మృతి చెందాడు. తహసీల్దార్ సాంబశివ ప్రసాద్, వైద్యాధికారి సుమ, ఎస్సై శ్రీనునాయక్‌లు మృతదేహాన్ని పరిశీలించారు. ప్రసాద్ వడదెబ్బ లేదా మరేదైనా కారణం ఉందా అనేది పోస్టుమార్టంలో నిర్ధారించాల్సి ఉందని తహసీల్దార్ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

యువతి ఆత్మహత్య


బావని (పాతచిత్రం)

సామర్లకోట: స్థానిక సాయినగర్‌కు చెందిన ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. సీఐ కె.దుర్గాప్రసాద్ కథనం ప్రకారం.. బుద్దల బావని (20) బీఎస్సీ కంప్యూటర్స్ చదివింది. చెన్నై విప్రో కంపెనీలో ఉద్యోగం వచ్చింది. 45 రోజుల శిక్షణ అనంతరం హైదరాబాద్‌లో నియమించారు. వారం రోజులు పని చేశాక కోయంబత్తూరుకు బదిలీ చేశారు. తనకు ఆరోగ్యం సహకరించదని, అంత దూరం వెళ్లలేనని బావని బదులిచ్చింది. కంపెనీ ప్రతినిధులు ససేమిరా అనడంతో తల్లిదండ్రులతో చర్చించేందుకు ఆమె సామర్లకోట వచ్చింది. నాలుగు రోజులుగా మనోవేదనకు గురవుతున్న ఆమె సోమవారం ఇంట్లో చెదల నివారణ మందు తాగి, ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. తండ్రి జగ్గరాజు ఫిర్యాదు మేరకు సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విధి వంచితుల జీవితాల్లో.. వెలుగులు

- దివ్యాంగులను ఆదుకుంటున్న ప్రభుత్వం
- నాలుగేళ్లలో రూ.1.02 కోట్ల ఉపకరణాల పంపిణీ
- విద్యార్థులకు స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు
- బ్యాక్‌లాగ్ పోస్టుల్లో అవకాశం


కాకినాడ జిల్లా తునిలో లబ్ధిదారులకు మూడు చక్రాల మోటార్ సైకిళ్లు పంపిణీ చేస్తున్న రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా (పాత చిత్రం)

కొవ్వూరు: అంగవైకల్యం ఉందని కుంగిపోనవసరం లేదు. వారికి ‘నేనున్నానని.. మీకేం కాదని’ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇస్తున్నారు. నాలుగేళ్ల కిందట అధికారంలోకి రాగానే రూ.3 వేల పింఛను ప్రకటించి వారిలో ఆత్మస్థైర్యం, ఆత్మ గౌరవాన్ని నింపారు. సంక్షేమ కార్యక్రమాలతో విధి వంచితుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. దైనందిన జీవనానికి అవసరమైన వినికిడి యంత్రాలు, క్రచెస్, చేతి కర్రలు, స్మార్ట్ ఫోన్లు, డైసీ ప్లేయర్లు, ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు, మూడు చక్రాల మోటార్ వాహనాల వంటి ఎనిమిది రకాల ఉపకరణాలను ప్రభుత్వం ఏటా ఉచితంగా పంపిణీ చేస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గడచిన నాలుగేళ్లలో కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లోని 1,101 మంది దివ్యాంగులకు వీటిని అందజేశారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1,02,52,210 ఖర్చు చేసింది. బీసీ, ఎస్సీ, ఎస్టీలతో పాటు ఓసీ కేటగిరీలో ఉన్న దివ్యాంగులకు సైతం వీటిని అందజేస్తారు.

210 మందికి ఉచితంగా త్రీ వీలర్లు

ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 10, ప్రతి జిల్లాకు 70 చొప్పున కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లోని 210 మందికి ఈ ఏడాది మూడు చక్రాల మోటార్ వాహనాలు పంపిణీ చేయనున్నారు. రూ.92 వేల విలువైన ఈ త్రీ వీలర్‌ను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. ఇందుకోసం ఈ మూడు జిల్లాలకు కలిపి రాష్ట్ర ప్రభుత్వం రూ.1,93,20,000 ఖర్చు చేస్తోంది. ఇప్పటికే కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలో ఈ వాహనాలు పంపిణీ పూర్తయ్యింది. తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించి ఈ నెల 19న పంపిణీ చేయనున్నారు. కోనసీమ జిల్లాకు ఇంకా వేదిక ఖరారు కావాల్సి ఉంది. నియోజకవర్గం వారీగా ఇవ్వాలా లేక జిల్లా యూనిట్‌గా పంపిణీ చేయలా అనే అంశంపై ఇంకా తర్జనభర్జనలు పడుతున్నారు. ఆయా జిల్లాల జాయింట్ కలెక్టర్ల అధ్యక్షతన ఉండే ఆరుగురు సభ్యుల కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేస్తుంది. దివ్యాంగులు నడుపుకోవడానికి అనువుగా టీవీఎస్ కంపెనీ వాహనాలను సరఫరా చేయనున్నారు.

విద్యార్థులకు స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు

చదువుకునే దివ్యాంగ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లు అందిస్తోంది. రూ.35 వేలు విలువైన ల్యాప్‌టాప్‌ను, రూ.15 వేల విలువైన స్మార్ట్‌ఫోన్‌ను పూర్తి ఉచితంగా అందజేస్తోంది. స్మార్ట్ ఫోన్ల కోసం ఇటీవల కొత్తగా 125 మందికి ప్రతిపాదనలు పంపారు.

111 బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ

బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో సైతం రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు సముచిత స్థానం కల్పిస్తోంది. తద్వారా వారి జీవన ప్రమాణాలను పెంచేందుకు తోడ్పాటునిస్తోంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ మూడు జిల్లాల్లో ఇప్పటి వరకూ 94 బ్యాక్‌లాగ్ పోస్టులను దివ్యాంగులతో భర్తీ చేసింది. ఈ ఏడాది 17 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. వీటిని ఇంకా భర్తీ చేయాల్సి ఉంది. మొత్తంగా గడచిన నాలుగేళ్లలో ఈ మూడు జిల్లాల్లో 111 బ్యాక్‌లాగ్ పోస్టుల్లో దివ్యాంగులకు అవకాశం కల్పించారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



అవసరమైన ఉపకరణాల కోసం దివ్యాంగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. స్మార్ట్ ఫోన్లు కావాలంటే వారు చదివే కళాశాల నుంచి లేఖ ఉండాలి. తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించి మూడు చక్రాల మోటార్ సైకిళ్లను రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో ఈ నెల 19న పంపిణీ చేస్తాం.

– వి.కామరాజు, సహాయ సంచాలకుడు, దివ్యాంగుల శాఖ, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా

నాలుగేళ్లలో ఉపకరణాలు పంపిణీ చేశారిలా..

సంవత్సరం	లబ్ధిదారులు	వెచ్చించిన మొత్తం (రూ.లక్షల్లో)
2019-20	387	35,04,000
2020-21	159	9,13,950
2021-22	297	36,18,760
2022-23	258	22,15,500
మొత్తం	1,101	1,02,52,210

బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ ఇలా..

సంవత్సరం	నోటిఫికేషన్	భర్తీ
2019-20	50	50
2020-21	42	42
2021-22	02	03
2022-23	17	అండర్ ప్రాసెస్
మొత్తం	111	94

దైన్యం నిండిన జీవితంలో ధైర్యం



ఈయన పేరు కిల్లాడ సన్యాసిరావు. కాకినాడ జిల్లా కోటనందూరు మండలం ఇందుగపల్లి. ఈయనకు ఒక కాలు, చేయి, కన్ను పని చేయవు. ఇంటి నుంచి కదల్లేని దుస్థితి. గతంలో ట్రై సైకిల్ ఉండేది. అది మూలన పడటంతో సన్యాసిరావుకు ఏ పనీ చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఏ అవసరం వచ్చినా ఎవరినో ఒకరిని బతిమాలుకోవాల్సి వచ్చేది. అతడి దైన్యాన్ని గుర్తించిన ప్రభుత్వం ప్రతి నెలా రూ.3 వేల పింఛను ఇచ్చి ఆదుకుంటోంది. ఇటీవల ట్రై మోటార్ సైకిల్ ఇచ్చింది. ‘దీంతో ప్రస్తుతం నా జీవనం కాస్త సాఫీగా సాగుతోంది. ఎవరి పైనా ఆధారపడకుండా నా పని నేనే చేసుకోగలుగుతున్నాను. ఎక్కడికైనా ఒక్కడినే వెళ్లగలుగుతున్నాను. ప్రభుత్వం చేసిన సహాయం చెప్పలేని ఆనందాన్నిస్తోంది. బతికున్నంత కాలం సీఎం జగన్ గారికి రుణపడి ఉంటాను’ అని సన్యాసిరావు సంతోషంగా చెప్పారు.

కల చెదిరి.. వ్యథ మిగిలి..

- తాళ్లరేవు ఆటో ప్రమాద మృతులకు కడసారి వీడ్కోలు
- గుండెలు పగిలేలా విలపించిన కుటుంబ సభ్యులు
- ఓదార్చిన ఎమ్మెల్యే అశోక్, మల్లాడి
- బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయానికి హామీ


సత్యవతి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు


పద్మ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మల్లాడి కృష్ణారావు తదితరులు


మృతదేహాలను తరలిస్తున్న యానాం ఎమ్మెల్యే అశోక్

యానాం/కాకినాడ క్రైం/తాళ్లరేవు: కష్టపడి సంపాదించుకుని.. మెరుగైన జీవితం గడపాలని ఒకరు.. కుమార్తె వివాహం చేయాలని మరొకరు.. బిడ్డలను మంచి చదువులు చదివించి, ప్రయోజకుల్ని చేయాలని ఇంకొకరు.. ఇలా ఆ కుటుంబాలు కన్న కలలు కళ్ల ముందే చెదిరిపోయాయి.. కన్నీటినే మిగిల్చాయి.. తాళ్లరేవు ఆటో ప్రమాదంలో మృతి చెందిన యానాం మహిళల కుటుంబాల్లో సోమవారం నెలకొన్న విషాద భరిత దృశ్యమిది. తాళ్లరేవు – యానాం మధ్య సుబ్బారాయుని దిమ్మ ప్రాంతంలో 216 జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం ఆటోను ప్రైవేటు బస్సు ఢీకొన్న ఘోర ప్రమాదంలో యానాం, పరిసర ప్రాంతాలకు చెందిన ఏడుగురు మహిళలు మృతి చెందిన విషయం తెలిసిందే. వారి మృతదేహాలకు కాకినాడ జీజీహెచ్ వైద్యులు సోమవారం పోస్టుమార్టం పూర్తి చేశారు. తలకు తీవ్ర గాయాలు కావడం వల్లనే ఈ మహిళలందరూ మృతి చెందారని వైద్యులు వెల్లడించారు. మృతుల్లో ఒక మహిళకు కాళ్లు తెగిపోయాయని, ఇద్దరికి పక్కటెముకలు నుజ్జునుజ్జయ్యాయని తెలిపారు. యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఢిల్లీలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాస్, పెదపూడి, కోరింగ ఎస్సైలు వాసు, పి.శ్రీనివాస్ కుమార్ తదితరులు ఉదయం నుంచీ కాకినాడ జీజీహెచ్ మార్చురీ వద్దనే ఉన్నారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను ప్రత్యేక వాహనాల్లో యానాం తీసుకువచ్చి, ఘన నివాళులర్పించారు. బూడపనీటి సత్యవతి (బాలయోగి నగర్), కల్లి పద్మ (కొత్తబస్టాండ్ వెంకట్‌నగర్), బొక్కా అనంతలక్ష్మి (ఫ్రాన్సితిప్ప), చెందిన శెట్టి వెంకటలక్ష్మి (మెట్టకూరు), నిమ్మకాయల వెంకటలక్ష్మి (కురసాంపేట), చింతపల్లి జ్యోతి (వెంకట్ నగర్) మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధువుల రోదనల నడుమ స్థానిక టైడల్ లాక్ సమీపాన హిందూ శ్మశాన వాటిక, మెట్టకూరు శ్మశాన వాటికల్లో ఆ మహిళల మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. మృతుల ఇళ్ల వద్దకు పెద్ద సంఖ్యలో జనాలు తరలివచ్చి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. హిందూ శ్మశాన వాటిక వద్ద మృతదేహాలకు మల్లాడి కృష్ణారావు, ఆర్ఏఓ మునిస్వామి కడసారి నివాళులర్పించారు.

ఇద్దరిపై కేసు

ఈ ప్రమాదానికి సంబంధించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్ తెలిపారు. బస్సును నిర్లక్ష్యంగా నడిపి, ఏడుగురి మృతికి, మరో ఏడుగురు గాయపడేందుకు కారకుడైన బస్సు డ్రైవర్ వేగిరాజు సుధీర్, క్లీనర్ ముంగమూరి మహేష్‌లపై కాకినాడ డీఎస్పీ మురళీ కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు 304, 337, 338 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. నిందితులిద్దరినీ అరెస్టు చేసి, కోర్టుకు తరలించామన్నారు.

మద్యం మత్తులోనే ప్రమాదం!

మద్యం మత్తు కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. డీజిల్ నింపుకొనేందుకు కాకినాడ నుంచి యానాం పట్టణానికి మోజో ట్రావెల్స్ బస్సును డ్రైవర్, క్లీనర్ తీసుకువచ్చారు. డీజిల్ నింపుకొన్న అనంతరం వారు మద్యం తాగినట్టు సమాచారం. ప్రమాద సమయానికి ఆ ఆ బస్సును డ్రైవర్‌కు బదులు క్లీనర్ నడుపుతున్నట్టు తెలిసింది. మద్యం మత్తులో బస్సును అదుపు చేయలేక, పక్కనే ఉన్న రెయిలింగ్‌ను, అనంతరం ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసులు ప్రాథమికంగా గుర్తించినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా పరిమితికి మించి మహిళా కార్మికులను ఎక్కించుకున్న ఆటో డ్రైవర్ గిడ్డి వెంకటేశ్వరరావుపై కూడా కేసు నమోదు చేయనున్నట్టు తెలిసింది.

అధైర్యం వద్దు.. ఆదుకుంటాం

మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని, ఎవ్వరూ అధైర్యపడొద్దని, ఎక్కువ మొత్తంలో ఆర్థిక సహాయం వచ్చేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే శ్రీనివాస్ అశోక్ అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఇప్పటికే పుదుచ్చేరి ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున తక్షణ ఆర్థిక సహాయం ప్రకటించిందని గుర్తు చేశారు. ఎమ్మెల్యేగా, వ్యక్తిగతంగా తాను ఒక్కో మృతురాలి కుటుంబానికి రూ.లక్ష చొప్పున రూ.7 లక్షల ఆర్థిక సహాయం అందిస్తానని చెప్పారు. మృతులకు రొయ్యల ఫ్యాక్టరీ నుంచి బీమా ఉందని, దీంతోపాటు వారు సైతం ఒక్కొకరికి రూ.5 లక్షల చొప్పున ఇవ్వనున్నారని తెలిపారు. ప్రమాదానికి కారణమైన ట్రావెల్స్ బస్సు యాజమాన్యంతో తాను మాట్లాడానని, వారి నుంచి సైతం రూ.3 లక్షల చొప్పున సహాయం అందుతుందని చెప్పారు. దీనిపై ఇప్పటికే అధికారులు సైతం చర్చిస్తున్నారన్నారు. అలాగే, మల్లాడి కృష్ణారావు కూడా వ్యక్తిగతంగా రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారని తెలిపారు. దీంతోపాటు వివిధ స్వచ్ఛంద సంస్థల నుంచి సైతం మరింత సహాయం అందేలా చర్యలు చేపట్టామని అశోక్ తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఎవ్వరైనా బాధిత కుటుంబాలను స్వచ్ఛందంగా ఆదుకోవచ్చని అన్నారు. మొత్తం మీద ఒక్కో కుటుంబానికి రూ.12 లక్షల నుంచి రూ.13 లక్షల వరకూ సహాయం అందే అవకాశం ఉందని చెప్పారు. అలాగే క్షతగాత్రులు ఒక్కొక్కరికి రూ.30 వేల చొప్పున అందిస్తామన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరి పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉందని, వారికి మరింత మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు.

ఎమ్మెల్సీగా కుడుపూడి ప్రమాణ స్వీకారం


అమరావతిలో ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సూర్యనారాయణరావు


ప్రమాణ స్వీకారం అనంతరం జిల్లా వైఎస్సార్ సీపీ నేతలతో సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావు అమరావతిలో సోమవారం ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల ఆయన ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఆయన ప్రమాణ స్వీకారోత్సవానికి ఉభయ గోదావరి జిల్లాల నుంచి పార్టీ శ్రేణులు, బీసీ నేతలు సోమవారం తరలివెళ్లారు. ప్రమాణ స్వీకారం చేసే సమయంలో ‘జై సూరి’ అంటూ నినాదాలు చేశారు. రాష్ట్ర దృశ్య కళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్య శైలజ, అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ అమలాపురం అధ్యక్షుడు సంసాని బులినాని, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, అయినవిల్లి జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, ఉభయ గోదావరి జిల్లాల బీసీ సంఘాల నేతలు కోడి దుర్గాప్రసాద్, కుక్కల శ్రీనివాసరావు, వాసంశెట్టి తాతాజీ, కుడుపూడి త్రినాథ్, కాంగ్రెగుల గోపి తదితరులు అమరావతి వెళ్లారు.

నేడు 40 కిలోమీటర్ల మేర ఊరేగింపు

ఎమ్మెల్సీగా ప్రమాణం స్వీకారం చేసిన అనంతరం కుడుపూడి సూర్యనారాయణరావు తొలిసారిగా మంగళవారం మధ్యాహ్నం జిల్లాకు రానున్నారని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు భారీ ఊరేగింపుతో ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు జరిగాయని చెప్పారు. రావులపాలెం మండలం గోపాలపురంలోని కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి నివాసం నుంచి మధ్యాహ్నం 2 గంటలకు ఊరేగింపు మొదలవుతుందన్నారు. ఎమ్మెల్సీ కుడుపూడి ఊరేగింపు వాహనంపై మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆశీనులవుతారని వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీసీ నాయకులు పాల్గొని ఈ ఊరేగింపును విజయవంతం చేయాలని బులినాని విజ్ఞప్తి చేశారు.

ఈఏపీ సెట్ ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చరల్ కోర్సులలో ప్రవేశాలకు నిర్వహించే ఈఏపీ సెట్ ఆన్‌లైన్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. అడ్మిషన్లు ఆలస్యం కాకుండా ఈసారి రెండు నెలలు ముందుగానే ఈ పరీక్షలు ప్రారంభించారు. అమలాపురం రీజియన్‌లో శ్రీనివాసా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్, బీవీసీ ఇనిస్టిట్యూట్ సైన్స్ కళాశాల, కాకినాడ రీజియన్‌లో ప్రగతి, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలు (సూరంపాలెం), రాజమహేంద్రవరం రీజియన్‌లో అయాన్ డిజిటల్ జోన్, గైట్(రాజానగరం)లలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రారంభ సమయంలో అక్కడక్కడ కొంతసేపు సర్వర్ సమస్య తలెత్తింది. తర్వాత పరిష్కరించారు. కోనసీమ జిల్లాలో 658, కాకినాడ జిల్లాలో 1,120, తూర్పు గోదావరి జిల్లాలో 1,333 మంది ఈ పరీక్షలకు హాజరయ్యారు.